క్లుప్తంగా

సేవా కార్యక్రమాల్లో ముందుంటాం

రంగారెడ్డినగర్: సేవా కార్యక్రమాల్లో ఎప్పుడు ముందుంటామని లయన్స్‌క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ అధ్యక్షుడు వినోద్‌జాదవ్ అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ డివిజన్ బాపూనగర్‌లోని ఆర్‌ఎస్‌కే స్కూల్‌లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ శిబిరంలో లయన్ దిలీప్ భట్టాచారి, లయన్ విజయ్ కుమార్ శెట్టి, లయన్ శ్రీనివాస్‌రెడ్డి, కిషోర్, ఆంజనేయులు, స్కూల్ కరస్పాండెంట్ రామేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్ అరుణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న ముడే రవి, లక్ష్మి దంపతులు

జీడిమెట్ల: వృద్ధులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని హార్ట్ టు హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు ముడే రవినాయక్ అన్నారు. శనివారం చెన్నైకి చెందిన లంక శ్రీనివాస్ అనే వ్యక్తి అందజేసిన రూ.5 వేలతో రవి నాయక్ జీడిమెట్లలోని ఇంటిగ్రేటెడ్ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యురాలు ముడే లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వైద్యులకు సన్మానం



వైద్యులను సత్కరించిన వెంకటేష్ ముదిరాజ్

సుభాష్‌నగర్: వైద్యుడు దేవుడితో సమానమని నార్త్ సిటీ హై స్కూల్ ప్రిన్సిపల్ కోల వెంకటేష్ ముదిరాజ్ అన్నారు. శనివారం డాక్టర్స్ డే పురస్కరించుకొని సూరారంలోని నార్త్ సిటీ హై స్కూల్ ఆధ్వర్యంలో వైద్యులు హుస్సేన్, రాంజీ, షౌకత్ అలీ, లింగం, సాంబశివరావును ఘనంగా సన్మానించారు.

చెరువుకు కంచె ఏర్పాటు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ సభ్యులు

నిజాంపేట్: బాచుపల్లిలోని భైరుని చెరువు చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని శనివారం కార్పొరేటర్ ఆగం పాండు ముదిరాజ్ ఆధ్వర్యంలో పోచమ్మ వినాయక యూత్ అసోసియేషన్ సభ్యులు మేయర్ నీలారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెరువులో ప్రమాదవశాత్తు పలువురు మృత్యువాత పడుతున్నారని, చెరువు చుట్టూ కంచె నిర్మాణంతో పాటు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయాలని కోరగా మేయర్ సానుకూలంగా స్పందించారు. వినతి ఇచ్చిన వారిలో కాసాని ఆంజనేయులు, దూసకంటి గిరి తదితరులు ఉన్నారు.

నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి కృషి చేస్తా



రంగారెడ్డినగర్: కుత్బుల్లాపూర్‌కు చెందిన ఉప్పల హరివేణుగోపాల్ నాయీ తెలంగాణ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. శనివారం పంజాగుట్టలోని కార్యాలయంలో జాతీయ నాయకుడు జగదీష్ నాయీ సమక్షంలో రాష్ట్ర అధ్యక్షుడు తొలిచుక్క నరసింహ నాయీ, తెలంగాణ స్టేట్ ప్రధాన కార్యదర్శి ఉప్పల భీమ్‌రావు నాయీ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హరివేణుగోపాల్ మాట్లాడుతూ.. నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, సత్యం, మోహన్, గడ్డం రవీందర్, హరి, యాదగిరి అక్షయ్ పాల్గొన్నారు.

బాచుపల్లి డీటీగా ప్రభుదాసు



నిజాంపేట్: బాచుపల్లి డిప్యూటీ తహసీల్దార్‌గా ప్రభుదాసు బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ డీటీగా విధులు నిర్వహించిన బాల భాస్కర్‌ను మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బదిలీ చేశారు. మల్కాజిగిరి ఆర్డీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ప్రభుదాసును బాచుపల్లికి బదిలీ చేశారు.

ప్రశాంతంగా గ్రూప్-4





సమయం మించిపోవడంతో పోలీసులను వేడుకుంటున్న దృశ్యం



కేంద్రం చిరునామా తెలియక గాజులరామానికి వచ్చిన యువతిని షాపూర్‌నగర్‌లోని సెంటర్‌కు తీసుకెళ్తున్న కానిస్టేబుల్ జగదీష్

- సెంటర్లు తెలియక తికమకపడ్డ అభ్యర్థులు
- పోలీసుల సహాయంతో సమయానికి చేరుకున్న అభ్యర్థులు

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్‌లో శనివారం గ్రూప్–4 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. వివిధ జిల్లాలకు చెందినవారి సెంటర్లు స్థానికంగా పడడంతో ఉదయమే హాజరయ్యారు. కొంత మందికి అడ్రస్ సరిగా తెలియకపోవడంతో చివరి సమయంలో గందరగోళానికి గురయ్యారు. మరి కొందరు సమయానికి సెంటర్‌కు రాకపోవడంతో అధికారులు వారికి అనుమతి ఇవ్వలేదు. షాపూ నగర్‌లోని పూర్ణిమ స్కూల్ సెంటర్‌కు గాజులరామారం రోడ్డు అని హాల్ టికెట్లు ఉండగా చాలా మంది సెంటర్ నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న గాజులరామారం వరకు వచ్చి వెనుదిరిగారు. అలా చివరి నిమిషంలో పోలీసులు గాజులరామారం నుంచి పూర్ణిమ స్కూల్ సెంటర్‌కు తమ వాహనంలో తీసుకెళ్లారు.



అభ్యర్థికి అడ్రస్ చెబుతున్న పోలీసులు



హాల్ టికెట్ల నంబర్లను సరిచూసుకుంటున్న అభ్యర్థులు



తల్లులు పరీక్షకు వెళ్లగా చిన్నారులతో తండ్రులు

కొనసాగుతున్న రిలే నిరాహారదీక్ష



రిలే నిరాహారదీక్ష చేస్తున్న కార్మికులు

జీడిమెట్ల: సూపర్ మ్యాక్స్ పరిశ్రమ కార్మికులు గత 125 రోజులుగా రిలే నిరాహారదీక్ష చేస్తున్నా యాజమాన్యం మొండివైఖరి వహించడం పట్ల కార్మిక యూనియన్ నాయకులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. జీడిమెట్లలోని సూపర్‌మ్యాక్స్ పరిశ్రమ కార్మికులకు రావాల్సిన 10 నెలల జీతాలు, వివిధ గ్రాంట్‌లు ఇవ్వకుండా పరిశ్రమలో ఉత్పత్తులను నిలిపివేసింది. దీంతో కార్మికులు గత 125రోజులుగా పరిశ్రమ ఎదుట రిలే నిరాహారదీక్ష నిర్వహిస్తున్నారు. అయినప్పటికి యాజమాన్యం కార్మికులను పట్టించుకోవడం లేదని కార్మికులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్మికులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లిన వారు పట్టించుకోవడం పట్ల కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నాయకులు వచ్చినప్పటికి ఏ ఒక్కరు తమకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడం లేదని కార్మికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు స్పందించి తమకు న్యాయం జరిగేలా చూడాలని కార్మికులు కోరుతున్నారు.

పేదలందరికీ 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నిజాంపేట్: పేదలందరికీ డబుల్ బెడ్రూమ్‌లు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం నియోజకవర్గానికి మూడు వేల ఇళ్లను మాత్రమే ఇస్తామని ప్రకటించడం అన్యాయమని ప్రజా సంఘాల పోరాట వేదిక బాచుపల్లి మండల నాయకులు ఆరోపించారు. శనివారం ప్రజా సంఘాల పోరాట వేదిక బాచుపల్లి మండల కన్వీనర్ వెంకటరామయ్య, మేడ్చల్ జిల్లా కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి బాలపీరు, సీఐటీయూ మండల కార్యదర్శి వెంకటరాజ్యం ఆధ్వర్యంలో బాచుపల్లి రెవెన్యూ అధికారులను కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇస్తామన్న సీఎం కేసీఆర్ ఇప్పుడు మాట మార్చడం తగదని, ఇళ్లులేని ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం ఇవ్వాలన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం గత తొమ్మిది సంవత్సరాలుగా పేద ప్రజలు ఎదురు చూస్తున్నారని, వాటిని వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 3న మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాకు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్వామి, మల్లికార్జున్, పెంటయ్య, మణి, లింగమ్మ, నాగేశు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



కాంగ్రెస్ పార్టీలో చేరిన యువకులు

దుండిగల్: కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. బాచుపల్లికి చెందిన కమ్మెట ముఖేష్, గజేంద్ర, నవీన్, విశాల్, సంజయ్ శనివారం తమ మిత్రబృందం 50 మందితో కలిసి కాంగ్రెస్‌లో చేరగా వీరికి పార్టీ కండువాలు కప్పిన అనంతరం భూపతిరెడ్డి మాట్లాడారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతను మోసం చేసిందని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ భృతితో పాటు ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీచేసి న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, బైరి ప్రశాంత్ గౌడ్, సదానందం, మిద్దెల యాదిరెడ్డి, మహేశ్, అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

దుండిగల్ అభివృద్ధికి కృషి



పనులకు శంకుస్థాపన చేస్తున్న కౌన్సిలర్ శంబీపూర్ కృష్ణ

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తున్నామని కౌన్సిలర్ శంబీపూర్ కృష్ణ అన్నారు. డీపోచంపల్లిలోని 8వ వార్డులో రూ.45 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, ఇతర అభివృద్ధి పనులను శనివారం ఆయన కౌన్సిలర్లు మహేందర్ యాదవ్, రమాదేవి, సాయి యాదవ్, రాము గౌడ్, భరత్‌కుమార్‌తో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వార్డుల్లో మెరుగైన వసతులు కల్పించే దిశగా పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్ రెడ్డి, యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, వెంకటేష్, కొల్తూర్ మల్లేష్, రాజశేఖర్ మనోజ సుధాకర్ పాల్గొన్నారు.

పదవీ విరమణ

చింతల్: బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్‌గా పదవీ విరమణ చేసిన అయూబ్‌ఖాన్‌కు శనివారం బషీర్‌బాగ్‌లోని కార్యాలయంలో జోనల్ మేనేజర్ సుభాకర్ మాల్యబత్తుల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి మానస టూల్ టెక్ అధినేత వాకిటి రామ్‌రెడ్డి హాజరై అయూబ్‌ఖాన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి విశ్రాంత జీవితం ఆనందంగా గడపాలని సూచించారు. చిన్నతరహా పరిశ్రమ అభివృద్ధికి అయూబ్‌ఖాన్ ఎంతో దోహదపడ్డారని 45 సంవత్సరాల పదవీ కాలంలో వేలాది పరిశ్రమలకు రుణాలు అందజేసి ఎంతో మంది ఉపాధి పొందేందుకు కృషి చేశారని వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జోనల్ మేనేజర్స్ కిశోర్ చంద్, రమేశ్ చంద్ కంది, అనిరుధరావు దేశ్పాండే, బాలానగర్ బ్రాంచ్ సిబ్బంది వాణి, సింధూజ పాల్గొన్నారు.



అయూబ్‌ఖాన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వాకిటి రామ్‌రెడ్డి

నిర్లక్ష్యానికి నిదర్శనం



ఈ చిత్రం చూస్తే అధికారులకు స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ఉన్న శ్రద్ధ ఏంటో అర్థమవుతోంది. కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయానికి కూతవేటు దూరంలోని చౌరస్తాలో తడి, పొడి చెత్త వేసేందుకు డంబర్ బిన్‌లను ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల డంబర్ బిన్‌లు మాయమై కేవలం స్టాండ్ మాత్రమే కనిపిస్తున్నాయి. ప్రతి నిత్యం అటుగా రాకపోకలు సాగించే సర్కిల్ అధికారులు వీటిని గమనించకపోవడం గమనార్హం.
– రంగారెడ్డినగర్

క్రీడా పోటీల్లో పాల్గొనండి

కూకట్‌పల్లి: గత విద్యా సంవత్సరం 2022–23లో 3, 4 తరగతులు చదివిన విద్యార్థులు ఈ విద్యా సంవత్సరం 2023–24లో 4, 5 తరగతుల్లో క్రీడా పాఠశాలలో అడ్మిషన్ పొందాలనుకునే కూకట్‌పల్లి, బాలానగర్ మండల పరిధిలోని విద్యార్థులకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కూకట్‌పల్లిలో ఈ నెల 4న క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి ఆంజనేయులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన 3, 4 తరగతులు పాసైన విద్యార్థులు స్థానిక కూకట్‌పల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు సురేష్‌ను సంప్రదించి క్రీడా పోటీల్లో పాల్గొనాలని తెలిపారు.

రేపు గురుపౌర్ణమి వేడుకలు

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగనగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో సోమవారం గురుపౌర్ణమి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జీవీకే కృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

రైతును రాజు చేసేందుకు ప్రభుత్వం కృషి



రైతులకు టిల్లర్ మిషన్లను అందజేసిన మర్రి రాజశేఖర్‌రెడ్డి

దుండిగల్: వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి రాష్ట్ర ప్రభుత్వం రైతులను రాజులుగా చేసేందుకు కృషి చేస్తోందని మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా శనివారం దుండిగల్‌లోని ఎంఎల్‌ఆర్‌ఐటీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో రూ.48 లక్షల విలువ చేసే టిల్లర్ మిషన్లను మేడ్చల్ జిల్లా ఉద్దేమర్రి గ్రామ రైతులకు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం రైతులను అనేక పథకాలతో ఆదుకుంటోందని, రైతుబంధు, రుణమాఫీలతో లక్షలాది మంది రైతుల కళ్లల్లో ఆనందాన్ని నింపుతోందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశయాలకు అనుగుణంగా తాము రైతులను ఆదుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్దేమర్రి సర్పంచ రవీందర్ రెడ్డి, నవీన్, మధు, ఎంఎల్‌ఆర్‌ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె శ్రీనివాస రావు, డాక్టర్ గుప్తా, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మెట్‌కానిగూడలో బండరాళ్ల పేలుళ్లు

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ మెట్‌కానిగూడలో రెండ్రోజులుగా జరుగుతున్న పేలుళ్లతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు. స్థానికంగా ఉన్న హనుమాన్ టెంపుల్ వద్ద ఓ వ్యక్తి అపార్ట్‌మెంట్ నిమిత్తం సెల్లార్ పనులను నిర్వహిస్తున్నారు. అందులో బండరాళ్లను శుక్రవారం తెల్లవారుజామున బర్మాతో పేల్చాడు. భారీ శబ్దం రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. శనివారం మరోసారి పేలుళ్లు జరగడంతో తమ ఇళ్లు ధ్వంసమయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

విధుల్లో జాగ్రత్తలు పాటించాలి

జీడిమెట్ల: విద్యుత్ ఉద్యోగులు విధులు నిర్వహించే క్రమంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీఈ నర్సింహారెడ్డి అన్నారు. శనివారం షాపూర్‌నగర్‌లోని విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన భద్రతా వారోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యోగులు విధుల నిర్వహణలో ప్రమాదాలు జరగకుండా పనులు నిర్వహించాలన్నారు. విధులు నిర్వహించే క్రమంలో ఉద్యోగులు సెఫ్టీ పరికరాలను ధరించి మరమ్మతులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ విరేషలింగం, ఏఈలు కృష్ణ, ఎస్.సురేందర్‌రెడ్డి, నర్సయ్య పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో సత్తా



రంగారెడ్డినగర్: మార్షల్ ఆర్ట్స్‌లో జాతీయ స్థాయిలో రాణిస్తూ జాతీయ బాల ప్రతిభా రత్న అవార్డు, బంగారు అశోక చక్ర అవార్డులను పొందిన విద్యార్థి శాన్వి దేబాల శనివారం తల్లిదండ్రులతో కలిసి కర్నాటక ఆరోగ్య శాఖమంత్రి డాక్టర్ శరణ్‌ప్రకాష్ పాటిల్‌ను కలిసింది. విద్యార్థిని అభినందించిన మంత్రి భవిష్యత్‌లో మరింతా రాణించాలన్నారు.

పోస్టర్ ప్రజెంటేషన్, క్విజ్ పోటీలలో కృష్ణవేణి విద్యార్థులు



సీఎస్ఐఆర్ వద్ద విద్యార్థులు

జీడిమెట్ల: తార్నాకలోని సీఎస్ఐఆర్‌లో జాదవ్‌పూర్ యూనివర్సిటీ, అలమ్‌నయ్ అసోషియేషన్ ఆధ్వర్యంలో శనివారం పాఠశాల, జూనియర్ కళాశాలల విద్యార్థులకు సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో పోస్టర్ ప్రజెంటేషన్, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న కృష్ణవేణి విద్యార్థులు ఎంపికయ్యారు. అక్కడ నిర్వహించిన పోస్టర్ ప్రజెంటేషన్, క్విజ్ పోటీల్లో పాల్గొన్ని సర్టిఫికెట్స్ సాధించారు. అనంతరం విద్యార్థులు వారికి ఉన్న సందేహాలను శాస్త్రవేత్తలతో మాట్లాడి తెలుసుకున్నారు.

బస్తీ దవాఖానాలతో పేదలకు మెరుగైన వైద్యం



డాక్టర్లతో సమావేశమైన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ నర్సింహయాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: సామాన్యుడికి అతి చెరువలో బస్తీ దవాఖానాలతో పాటు వైద్య పరీక్షలు చేయించుకునేందుకు వీలుగా సకల సౌకర్యాలను ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని బస్తీ దవాఖానాలను కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌తో కలిసి సందర్శించారు. డివిజన్‌లోని శాంతినికేతన్ కాలనీ, అంజయ్యనగర్, వార్డు కార్యాలయంలోని బస్తీ దవాఖానాలతో పాటు హస్మత్ పేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యలపై డాక్టర్లతో చర్చించారు. ప్రజలకు కావాల్సిన అన్నీ మౌలిక సదుపాయలు, మందుల విషయంలో ఇబ్బందులు ఉంటే తెలియజేయాలని డాక్టర్లను కోరారు. హస్మత్‌పేట లైన్స్‌టౌన్ కాలనీలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇరుకు గదులలో చాలిచాలని వసతులతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పడంతో త్వరలో హస్మత్‌పేట మోడల్ మార్కెట్ భవనంలోకి మారేలా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రతి సమస్యను పరిష్కారిస్తున్నామని తెలిపారు. అనంతరం ప్రపంచ వైద్యుల దినోత్సం సందర్భంగా డాక్టర్లను సత్కారించారు. డాక్టర్ చందర్, డాక్టర్ రవికాంత్, ఈఈ గోవర్ధన్‌గౌడ్, డీఈ బాలకృష్ణ, ఏఈ అరవింద్, వాటర్ వర్క్స్ ఏఈ తేజ, నాయకులు మేకల హరినాథ్, ముక్కాల నర్సింగ్‌రావు, ముక్కాల సత్యనారాయణ, ముక్కాల అశోక్, సునిల్, లలితా బలరాజ్, మట్టిశ్రీను పాల్గొన్నారు.

మిద్దెసాగు.. భలేబాగు



మెద్దెపై కాసిన బీరకాయలను చూపుతున్న నరేందర్‌రెడ్డి



చెట్టుకు కాసిన మామిడికాయను చూపుతున్న మంజుల

జీడిమెట్ల: కాస్తా సమయం కేటాయిస్తే మన ఇంటి పరిసరాల్లోనే కాయగూరలు పండించుకోవచ్చని నాగిళ్ల నరేందర్‌రెడ్డి, మంజుల దంపతులు అంటున్నారు. సుభాష్ నగర్ డివిజన్ ఎస్.ఆర్ నాయక్ నగర్‌కు చెందిన వీరు మిద్దెపై కూరగాయలు, పండ్ల మొక్కలు సాగు చేస్తున్నారు. ప్రతిరోజు కేవలం గంట సమయం కేటాయించడంతో ఇంటికి అవసరమైన కాయగూరలు దాదాపు పండించుకుంటున్నామని వారు పేర్కొంటున్నారు.



ఎరువుగా వర్మికంపోస్ట్..

వారి తోటలో తయారు చేసిన వర్మి కంపోస్టును మొక్కలకు ఎరువుగా వాడుతున్నారు. రెండు వారాలకు ఒకసారి మొక్కలకు వర్మికంపోస్టును వేస్తుండటంతో మొక్కలు ఏపుగా పెరగడంతో పాటు ఆకులు మంచి రంగులో వస్తున్నాయి. మొక్కల్లో ఏవైనా చీడ పురుగులు కనిపిస్తే ఇంటిలోనే వేపనూనె, పొగకు కట్టెలతో తయారు చేసిన ద్రావణాన్ని మొక్కలపై పిచికారి చేస్తున్నారు. పాలకూర, గంగవాయిల్ కూర, తోటకూర, బచ్చలికూర, బీరకాయ, సొరకాయ, కాకరకాయ, వంకాయలు, టమాటలతో పాటు అంజీర్, అల్లనేరేడు, జామ, డ్రాగన్‌ఫ్రూట్ వంటి కూరగాయలు, పండ్లు కాస్తున్నాయి. ఎవరికైనా ఆసక్తి ఉంటే తమను సంప్రదిస్తే వారికి మిద్దె సాగు పద్ధతులకు వివరిస్తామంటున్నారు.